# ఆధార్‌పై సీఐఏ!



## కార్డుల జారీ ప్రాజెక్టులోని రెండు కంపెనీలకు అమెరికా గూఢచార సంస్థతో సంబంధాలు

### మనందరి సమాచారం అమెరికా గుప్పిట్లోకి?

### ఆ దేశ ఒత్తిడి మేరకే శరవేగంగా కార్డుల పంపిణీ

### వికీలీక్స్ పత్రాలతో బట్టబయలైన అగ్రరాజ్యం ఆసక్తి

### మన సమస్త సమాచారం నిఘా విభాగం చేతుల్లోకి

### త్వరలో డీఎన్ఏ వివరాలూ ఆధార్ పరిధిలోకే

### విచ్ఛిన్నకర శక్తుల చేతుల్లో పడితే అంతే సంగతులు!

మనదేశంలో మనకు వ్యక్తి స్వేచ్ఛ ఉందా? అనుక్షణం నిఘానేత్రం కింద బతకాల్సిన దుస్థితి దాపురించబోతోందా? మన వ్యక్తిగత సమాచారం అమెరికా చేతుల్లోకి వెళ్లబోతోందా? అన్నిటికీ సర్వరోగ చింతామణి ఆధార్ కార్డేనంటూ ప్రజల నుంచి సేకరిస్తున్న సమాచారం ఈ ఉపద్రవానికి కారణమవబోతోందా? తరచి చూస్తే అవుననే అనిపిస్తోంది. 'ఆధార్' తంతు వెనక అంత తేలిగ్గా అర్థం కాని అంతర్జాతీయ

మిగతా 8వ పేజీలో

# ఆధార్‌పై సీ'ఐ'ఏ!

గూడుపుఠాణీ కనిపిస్తోంది. ప్రాజెక్టులో పాలువంచుకుంటున్న రెండు సంస్థలకు సీఐఏతో సంబంధాలు బయటపడుతున్నాయి. నిపుణులను భయపెడుతున్నాయి. ఆధార్ ద్వారా సేకరిస్తున్న సమాచారం విచ్ఛిన్నకర శక్తుల చేతుల్లో పడే ప్రమాదం వెన్నులో వణుకు పుట్టిస్తోంది!

మీరు గ్యాస్ బుక్ చేసినప్పుడల్లా ఆధార్ కార్డు గురించి ఆరాతీస్తున్నారా?

కనీసం, ఆధార్‌కు అప్లై చేసినట్టు ఆధారాలు చూపించాలని అడుగుతున్నారా?

ఈ గోల పడలేక మీరు ఆధార్ కార్డుకు దరఖాస్తు చేశారా?

అయితే... మీరు డేంజర్‌జోన్‌లోకి అడుగుపెట్టినట్టే! అర్థం కాలేదా... అయితే చదవండి..!

ఒక వ్యక్తి తాను భారతీయ పౌరుడినని రుజువు చేసుకోవటానికి ఒక ఆధారం కావాలి. అది డ్రైవింగ్ లైసెన్స్ కావచ్చు. పాస్‌పోర్టు కావచ్చు. రేషన్‌కార్డు కావచ్చు. ఈ విధమైన పత్రాలు 16 దాకా ఉన్నాయి. వీటిలో కొన్నింటిలో ఫొటోలుంటాయి. మరి కొన్నింటికి వేలి ముద్రలు సేకరిస్తారు. కొన్నింటిలో కంటిపాపల గుర్తులను నమోదు చేస్తారు. వీటన్నింటికి బదులు... ఒక వ్యక్తి సమాచారం అంతా ఒకేచోట ఉండేలా ఆధార్‌ను తెరపైకి తెచ్చింది సర్కారు. ఇందులో వ్యక్తుల రెండు చేతుల వేళ్ల గుర్తులు, కంటి పాప గుర్తులు, మన ముఖాన్ని గుర్తించడానికి వీలుగా ఫొటో ఉంటాయి. ఈ మూడింటితో పాటు సదరు వ్యక్తి మొత్తం సమాచారం సేకరిస్తారు. కానీ... ఆధార్‌కార్డుల్లోని వ్యక్తిగత సమాచారాన్ని ఎవరైనా ఉపయోగించుకునే ప్రమాదం ఉందని ఢిల్లీలోని సిటిజన్స్ ఫోరం ఫర్ సివిల్ లిబర్టీస్‌కి చెందిన గోపాలకృష్ణ హెచ్చరిస్తున్నారు. సంక్షేమ పథకాలను సమర్థంగా అమలుచేయడానికి ఈకార్డు పనికొస్తుందని ప్రభుత్వం వాదిస్తోంది. పైకి ఈ వాదనను బలంగా ప్రచారం చేయటానికి ప్రయత్నిస్తున్నా.. ప్రభుత్వం బయటకు చెప్పని అనేక విషయాలు ఒకటి తర్వాత మరొకటి బయటకు వస్తున్నాయి. ఈమధ్య అసోచామ్, అంతర్జాతీయ కన్సల్టెన్సీ సంస్థ కేజీఎంజీలు కలిసి 'హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ ఇన్ ఇండియా' అనే సర్వే చేశాయి. ఈ నివేదిక ప్రకారం... ఆధార్ ద్వారా సేకరించిన మొత్తం సమాచారాన్ని నేషనల్ ఇంటిలిజెన్స్ గ్రిడ్ ఆధీనంలో ఉంచుతారు. ఈ గ్రిడ్... కేంద్ర హోం శాఖ ఆధీనంలో ఉంటుంది. ఆధార్ సమాచారం తీవ్రవాదులు, ఇతర విచ్ఛిన్నకర శక్తుల చేతిలో పడకుండా ఉండాలంటే ఇలా ఒక బాధ్యతాయుతమైన సంస్థ చేతిలో ఈ సమాచారం ఉండాలని ప్రభుత్వం వాదిస్తోంది. కానీ, నిజంగానే ఈ సమాచారం ఎవరికి తెలియదా? ఈ విషయాన్ని పరిశీలిస్తే దిగ్భ్రాంతిని కలిగించే సత్యాలు బయటపడతాయి.

## సీఐఏ లింకులు...

ఆధార్ కార్డులను యునిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా(యూఐడీఏఐ) సంస్థ తయారుచేస్తోంది. దీనికి ఇన్ఫోసిస్ మాజీ ఛైర్మన్ నందన్ నీలేకని ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. వాస్తవానికి ఈ సంస్థ తాను చేయాల్సిన పనిని కొన్ని కంపెనీలకు అవుట్‌సోర్సింగ్‌కి ఇచ్చింది. ఈ కంపెనీలలో ఒకటి ఎల్1 ఐడెంటిటీ సొల్యూషన్స్. ఈ కంపెనీ అమెరికా గూఢచార సంస్థ సీఐఏకి సాయం చేస్తూ ఉంటుంది. సదరు సంస్థ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్‌లో సీఐఏ డైరెక్టర్ కూడా సభ్యుడిగా ఉండేవారు. అంతేకాదు. ఎల్1 కంపెనీ డైరెక్టర్లు ఒబామాతో కలిసి భారత్‌కు వచ్చారు. ఇక్కడ యూఐడీఏఐ కార్యాలయానికి కూడా వెళ్లారు. అక్కడ జరుగుతున్న పనిని పరిశీలించారు. ఈ కంపెనీతో పాటు.. ఆధార్‌కు సంబంధించిన మరికొన్ని ప్రాజెక్టులను ఎక్సంచూర్ అనే మరో ఐటీసంస్థ నిర్వహిస్తోంది. దానికీ సీఐఏతో సంబంధాలున్నాయి.

మరోవైపు... ఆధార్ గురించి అమెరికా ప్రభుత్వం చాలా ఆసక్తిగా ఉందనే విషయం ఇటీవల వెలువడిన వికీలీక్స్‌లో స్పష్టమైంది. ఆధార్ పథకం ఎలా సాగుతోంది? దాని భద్రతా అంశాలు ఎలా ఉన్నాయి? తీవ్రవాదులు ఈ సమాచారాన్ని సేకరించే అవకాశముందా? మొదలైన విషయాలు తెలియజేయాలని అమెరికా విదేశాంగ శాఖ తన రాయబార కార్యాలయానికి ఇచ్చిన ఆదేశాలు వికీలీక్స్ వెబ్‌సైట్‌లో స్పష్టంగా ఉన్నాయి.

## రాజ్యాంగ విరుద్ధం కూడా..

యూఐడీఏఐ సంస్థను కేంద్ర ప్రణాళికా సంఘం ఒక నోటిఫికేషన్ ద్వారా ఏర్పాటు చేసింది. సంస్థ అయితే ఏర్పాటు అయింది తప్పితే... ఇప్పటిదాకా దీనికి చట్టబద్ధత రాలేదు. ప్రభుత్వం పార్లమెంట్‌లో 'నేషనల్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా బిల్, 2010'ని ప్రవేశపెట్టింది. దీనికి ఇంకా పార్లమెంట్ అనుమతి లభించలేదు. ఈ బిల్లు చివరలో పెట్టిన ఒక నిబంధనపై అనేక విమర్శలు చెలరేగుతున్నాయి. ఈ నిబంధన ప్రకారం– 2009 నుంచి యూఐడీఏఐ చేసిన పనులన్నింటినీ పార్లమెంట్ ఆమోదించాలి. అంతేకాదు.. యూఐడీఏఐ వివిధ రాష్ట్ర ప్రభుత్వాలతో ఒప్పందాలు కుదుర్చుకుంది. రాజ్యాంగబద్ధం కానీ ఒక సంస్థతో వివిధ కంపెనీలు కానీ రాష్ట్ర ప్రభుత్వాలు కుదుర్చుకున్న ఒప్పందాలకు చట్టబద్ధత ఉండదనేది న్యాయ నిపుణుల వాదన. ఈ వ్యవహారంలో అమెరికా చాలా కీలకపాత్ర పోషిస్తోందనే ఆరోపణలున్నాయి. ఇటీవల ప్రపంచబ్యాంకు 'ఈ–ట్రాన్స్‌ఫర్మేషన్' అనే ఒక ప్రాజెక్టును ప్రారంభించింది. ఈ ప్రాజెక్టులో భాగంగా రెండు ప్రభుత్వాలతో (దక్షిణ కొరియా, ఫ్రాన్స్), ఆరు కంపెనీలతో ఒప్పందం చేసుకుంది. ప్రపంచంలో అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఈ–గవర్నెన్స్ పూర్తిగా అమలు చేయలేకపోతున్నారని.. అందువల్ల ఈ–గవర్నెన్స్ పథకాలు పటిష్ఠంగా అమలు చేయడానికి ఈ ప్రాజెక్టును

ఉద్దేశించారు. ఈ ప్రాజెక్టులో యూఐడీ కార్డుల ప్రస్తావన కూడా ఉంది. ప్రస్తుతం మన దేశంలో అమలుచేస్తున్న ఆధార్ ప్రాజెక్టు కూడా ఇలాంటిదేననేది విమర్శకుల వాదన. దీనివల్ల మన దేశంలో ఉన్న మానవ వనరుల మొత్తం సమాచారం అమెరికా వంటి దేశాల చేతికి చిక్కుతుంది. వివిధ కంపెనీలకు ఈ సమాచారం ఎంతో ఉపయోగపడుతుంది. భవిష్యత్తులో భారత్ ప్రపంచంలోనే అతి పెద్ద మార్కెట్‌గా అవతరించే అవకాశాలు ఉన్న నేపథ్యంలో... మార్కెట్లను జయించటానికి ఇలాంటి సమాచారం కీలకపాత్ర పోషిస్తుంది. అందువల్లే అమెరికా ఈ ప్రాజెక్టుపై విపరీతమైన ఆసక్తి చూపిస్తోంది. అమెరికన్ కంపెనీలు ఈ ప్రాజెక్టులో కీలక పాత్ర పోషిస్తున్నాయి. దీనికి తోడు ప్రభుత్వం కూడా ఈ పథకానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. ఎక్కువగా నిధులు కూడా కేటాయిస్తోంది. 2009లో ఈ ప్రాజెక్టుకు కేంద్రం కేవలం రూ.120 కోట్లు మాత్రమే కేటాయిస్తే.. 2010లో ఈ మొత్తం రూ.1200 కోట్లకు పెరిగింది. ఈ సమాచారాన్ని సేకరించటం వల్ల అమెరికాకు ఎలాంటి లబ్ధి చేకూరుతుందనే ప్రశ్న కు, ప్రభుత్వం చాప కింద నీరులా చేస్తున్న కొన్ని ప్రయత్నాలు సమాధానం చెబుతాయి.

## భారత్‌లో నివసించేవారందరికీ!

యూఐడీ చైర్మన్ నందన్ నీలేకనిపై అనేక ఆరోపణలున్నాయి. ఆయన 11 కంపెనీలలో డైరెక్టర్‌గా ఉన్నారు. వాటిలో కొన్ని ఆధార్ కార్డులకు సంబంధించిన ప్రాజెక్టులు చేస్తున్నాయి. ఈ మధ్య ఆధార్ అంశాలకు సంబంధించి ఎడిటర్స్ గిల్డ్ ఒక సమావేశం నిర్వహించింది. దీనిలో ఒక బిజినెస్ ఎడిటర్- "మీరు డైరెక్టర్‌గా ఉన్న కొన్ని కంపెనీలు ఈ సంస్థలో ప్రాజెక్టులు చేస్తున్నాయి. ఇది నైతిక సూత్రాలకు విరుద్ధం కాదా?" అని ప్రశ్నించారు. దీనికి నీలేకని- "ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసే సమయాల్లో నేను దూరంగా ఉంటా" అన్నారు.

ఇక... ఆధార్ సమాచారాన్ని దాచే నేషనల్ ఇంటిలిజెన్స్ గ్రిడ్ అధిపతి కెప్టెన్ రఘురామన్ ఒకప్పుడు 'ఏ నేషన్ ఆఫ్ నంబ్ పీపుల్' అనే 22 పేజీల పత్రాన్ని సమర్పించారు. ఆ పత్రంలో ఆయన... "అంతర్గత భద్రత విచ్ఛిన్నమయిపోతోంది. ప్రభుత్వానికి, అధికారులకు ఈ విషయం తెలుసు. కార్పొరేట్ అధిపతులు రావాల్సిన సమయం ఆసన్నమైంది " అన్నారు. ఇంకా చెప్పాలంటే.. కార్పొరేట్ సంస్థలు అంతర్గత భద్రతకు సంబంధించిన విషయాల్లో కలగజేసుకోవాలని.. ప్రైవేట్ సైన్యాలు తయారుచేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఇటీవల దలైలామాకు కూడా ఆధార్ కార్డును జారీ చేసింది. వాస్తవానికి ఆయన భారతీయ పౌరుడు కాదు. అయితే ఆయనకు కార్డును జారీ చేసిన తర్వాత ప్రభుత్వం తన వైఖరిని మార్చుకుంది. అప్పటి దాకా కేవలం భారత పౌరులకు మాత్రమే కార్డులను జారీ చేస్తామంది. ఆయనకిచ్చాక... భారత్‌లో నివసించేవారందరికి కార్డులు జారీ చేస్తామని ప్రకటించింది.

మన ప్రభుత్వం డీఎన్ఏ ప్రొఫైలింగ్ బిల్లును తయారుచేస్తోంది. వ్యక్తులకు సంబంధించిన డీఎన్ఏ సమాచారాన్ని సేకరించే అధికారం ప్రభుత్వానికి ఈ బిల్లు వల్ల వస్తుంది. దాంతో పాటు... డ్రాఫ్ట్ ల్యాండ్ టిల్లింగ్ బిల్, 2010.. ప్రైవసీ బిల్, 2010 మొదలైన వాటిలో కూడా యూనిక్ ఐడెంటిఫికేషన్‌ను చేర్చే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇదే నిజమైతే- మీది, మాది.. మనందరిదీ... డీఎన్ఏ సమాచారంతో సహా అన్ని వివరాలూ గూఢచారి వర్గాల చేతిలో ఉన్నట్లే! -స్పెషల్ డెస్క్

(ఆధార్‌పై సిటిజెన్స్ ఫోరం ఫర్ సివిల్ లిబర్టీస్‌కు చెందిన గోపాలకృష్ణతో ముఖాముఖీ 4వ పేజీలో)

## కొంప ముంచుతున్న గులాబీకార్డులు!

హైదరాబాద్: ప్రభుత్వ విధానం వల్ల.. దేశంలో అక్రమంగా ఉంటున్న పాక్, బంగ్లా జాతీయులకూ ఆధార్‌కార్డులు జారీ అయ్యే ప్రమాదం ఉందంటున్నారు పోలీసులు. 16 రకాల అడ్రస్ ప్రూఫుల్లో ఏదో ఒకదాన్ని తీసుకుని సర్కారు ఆధార్ కార్డు ఇస్తోంది. వీటిలో ప్రధానమైనది రేషన్ కార్డు. గతంలో బంగ్లాదేశ్‌కు చెందిన రఫ్సంజానీ, రిజ్వాన్ ఘాజీలకు హైదరాబాద్‌లో కార్డులిచ్చారు! 2006-07లో హైదరాబాద్ టోలీచౌక్ ఆడమ్స్ కాలనీలో 200 డిక్లరేషన్ ఫారాలను దుండగులు దొంగిలించారు. వీటి ఆధారంగా ఈ శక్తులు కార్డులు పొందితే ఆధార్‌కార్డు పొందడం చాలా సులభం. అధికారులు గులాబీ కార్డుల వివరాలను పెద్దగా పట్టించుకోరు. దీంతో వాటి ఆధారంగా అసాంఘిక శక్తులు ఆధార్ కార్డులు పొందేందుకు ప్రయత్నిస్తున్నాయని పోలీసులు అనుమానిస్తున్నారు.